తాళ్లూరు నాగేశ్వరరావు

మబ్బు వెన్నెల

మబ్బుల్లేకుండా బడబడ వడగళ్ళ వాన పడ్డట్టుగా – గరల్స్ హైస్కూలు స్టాఫ్‌రూమ్‌లో ఒక్కుమ్మడిగా ఆరుగురు ఆడవాళ్ళు పొట్ట చెక్కలయ్యేట్టు ఫెళ్ళున నవ్వారు.

ఆనవ్వుల దూకుడికీ, వేళాకోళానికీ ఆరూములో తూర్పుదిక్కున ఒంటరిగా కూర్చున్న శారదమనస్సు చివుక్కుమన్నది. వాళ్ళ తనవిగురించే అట్టహాసం పట్టపగలుగా నవ్వుతున్నారు; ఆ నవ్వుల్లోని వ్యంగ్యాత్మకమైన ఎగతాళి తనని గురించే.

ప్యూను రాములు ఆరోజు స్టాఫ్‌కు వచ్చిన ఉత్తరాల్ని తీసికొచ్చి పేరు పేరునా అందరికీ ఇచ్చాడు. కాని శారదకు ఒక్క ఉత్తరంకూడా రాలేదు. ఆ స్కూల్లోచేరిన రెండేళ్ళ దగ్గర్నుంచీ ఆమె కెప్పుడూ ఒక్క కార్డుముక్క కూడా రాలేదు. మిగతా స్టాఫ్ మెంబర్ల నవ్వులకూ, అపహాస్యాలకూ అదే ముఖ్యకారణం.

"అసలెప్పుడూ ఉత్తరాలు రానివాళ్ళు దేశంలో మచ్చుకైనా వుంటారా ?" అన్నది సైన్సు బి. ఇడి. విజయలక్ష్మి.

"ఉంటారు !" అన్నది – సోషల్ స్టడీస్ టీచరు గోవర్ధనమ్మ.

"ఎక్కడ ?"

"ఎవరు ?"

"పోస్టల్ డిపార్టుమెంటు మొత్తాన్ని ఎంక్వయిరీ చేశావా ?"

"తోటి టీచర్ల మొహాలకేసి తెచ్చి పెట్టుకున్న గాంభీర్యంతో చూసి, అంతలోనే పెదవులపై చిరునవ్వును వెదల్చి చేసి, "హిమాలయ పర్వతాల్లో, ఇరవై నాలుగువేల అడుగుల ఎత్తున కాంచన గంగ శిఖరంపై, శరీరాన్ని తినివేసే మంచుగడ్డల మధ్య ముక్కుమూసుకుని ఏకాగ్ర చిత్తంతో తపస్సుచేసే ఋషి పుంగవులకు ఉత్తలురావు." అన్నది గోవర్ధనమ్మ.

అందరూ పొట్టలు చెక్కలయ్యేటట్టు నవ్వారు.

"అంటే – మనశారద ఆ కోవకు చెందిన యోగినా ?" అన్నది – లెక్కల అసిస్టెంటు అనూరాధ.

మళ్ళీ ఆగదిలో నవ్వులు సముద్ర కెరటాల్లా నురుగులు కక్కాయి.

వాళ్ళ నవ్వులకూ, హాస్యానికీ, అవహేళనకూ శారదమనస్సు ఈతముల్లు గుచ్చుకున్నట్టు మెరమెర లాడిపోయింది. కాని పైకి పల్లెత్తుమాట అనలేదు. బాధను గుండెలో గుట్టు చప్పుడుకాకుండా ఇముడ్చుకోవడానికి- పదేళ్ళుగా ఆమె అలవాటుపడింది.

అందరికీ ఉత్తరాలు రావడంలో ఆశ్చర్యంలేదు. అట్లాగే తనకీ ఉత్తరాలు ఎవ్వరిదగ్గర్నుంచీ రాకపోవడంలో అబ్బురంలేదు. తనకి ఆప్తబంధువులు లేరు; ఆప్తమిత్రులులేరు; ప్రేమించేవారు లేరు; ప్రేమించబడేవాళ్ళ లేరు; శ్రేయోభిలాషులులేరు; శత్రువులులేరు. తను అతి సామాన్యమైనట్టిది. చిత్రలేఖనములో, సంగీత సాహిత్యాలలో, సాంఘిక సేవలో – ఎందులోనూ ప్రత్యేకతలేదు; ప్రావీణ్యతలేదు. తనకి ఎవరిదగ్గర్నుంచి ఉత్తరాలు వస్తాయి ? ఉత్తరాలు రాకపోవడం న్యూనతా ? సాంఘికమైన హోదాకు భంగమా ? ఏకాకి బ్రతుక్కి సూచనా! అనుకున్నది–శారద విశ్శబ్దంగా.

శారద ఆ హైస్కూల్లోచేరి రెండేళ్ళయింది. గుంటూరులో బి. ఇడి. ట్రైనింగ్ పూర్తికాగానే ఒక పుణ్యాత్ముని

చలువవల్ల పుట్టిపెరిగిన చోటనే ఉద్యోగం కూడా లభించింది. ఆమెవయస్సు మొన్న శ్రావణానికి సరీగ్గా ఇరవైమూడేళ్ళు. అవివాహిత, తండ్రి మరణించి ఒక దశాబ్దమై ఉంటుంది. కన్నతల్లే సర్వస్వం. కాని ఆవిడది అతుకుమెత్తని ఆరోగ్యం; రెండుపూటలు బావుంటే మూడోపూట మంచమెక్కుతుంది. ఉబ్బసమూ, ఉష్ణమూ, గుండెజబ్బు, కడుపునొప్పి - ఇత్యాది రోగాలు ఆవిడను చావనివ్వకుండా అడకత్తెరలోపోకకాయ స్థితిని కల్పిస్తూఉంటాయి. శారద ఇంకా ఎందుకు పెళ్ళిచేసుకోలేదు ? — అన్న ప్రశ్నకు, "మనం ఏంచేయగలం ? ఆ కల్యాణగడియ రావాలి," అంటుందావిడ. శారదమటుకు నీటిలోకప్ప నీరు త్రాగినంత నిర్లిప్తతతో చిరునవ్వు నవ్వుతుంది.

సెలవు రోజుల్లో అప్పుడప్పుడూ శారద గుంటూరు వెళ్ళివస్తూ వుంటుంది. ఏడాదిన్నర క్రితం టిక్కెట్టు కలెక్టరు రాంమోహన్‌తో ఆమెకు విచిత్రంగా పరిచయమైంది. ఒకరోజు ఆమె గుంటూరునుంచి తెనాలి రైల్లో వస్తూండగా చేతిలోవున్న చిన్న పర్సుపోయింది. దాన్ని దొంగ లెత్తుకెళ్ళారో, జారిపోయిందో కూడా ఆమెకు వివరంగా తెలియదు. ఆ పర్సులో రైల్వేటిక్కెట్టూ, మూడున్నర రూపాయల చిల్లరా ఉన్నాయి. వేజెండ్ల దగ్గిర టిక్కెట్టు చెక్కింగ్ ఇనస్పెక్టరు రాంమోహన్ ఆ బండీలో టిక్కెట్లు చెక్‌వేస్తూ ఆమెను అడిగాడు. ఆమె భయంతో కంపించిపోయి కలవరపడలేదు నిజాన్ని నిర్భయంగా చెప్పింది. అతను సానుభూతి కనబర్చి, ఏ ఇబ్బందీ లేకుండా తెనాలి స్టేషన్లో దాటవేశాడు — టిక్కెట్టు కలెక్టరుతోచెప్పి. ఆమె కృతజ్ఞతాపూర్వకంగా నమస్కారం చేసింది. ఆపైన ఆరైల్లో చాలామాట్లు ఇద్దరూ

తటస్థపడడం జరిగింది. తల్లికి కడుపులో వ్రణానికి ట్రీట్మెంటుకు గుంటూరు గవర్నమెంటు హాస్పటల్లో చేర్పించినప్పుడు శారద తరుచు రైల్లో వస్తూపోతూండేది. వారిరువురు మధ్య స్నేహం రెమ్మలూ కొమ్మలుగా అభివృద్ధి కాసాగింది. కాని. ఆమె ఆస్నేహాన్ని ఎప్పుడూ ప్రేమగా ఊహించుకుని మధురమైన మృగతృష్ణలో మల్లెపూ పరిమళంవలె తేలిపోలేదు.

అందంలో పందెం వేయదగ్గ యువకుడు రాంమోహన్. తెల్లగా, పొడుగ్గా, ఆకర్షణీయంగా ఉంటాడు. కన్నెమనసులో వలపువెర్రిని పుట్టించగల మహత్తు అతని పర్సనాలిటీకున్నది. కాని కోడెత్రాచులాంటి యువకునిలో కోర్కెలను రెపరెపలాడించే అందమూ, ఆకర్షణా శారదలో లేవు. సామాన్యమైనస్త్రీ. శరీరంలో ఏ భాగానికి ఆ భాగం తీర్చిదిద్దినట్లు వున్నప్పటికీ, పురుషహృదయాన్ని సూటిగాతాకే చైతన్యపూరితమైన ఆకర్షణ లేదు. ఆమె సౌందర్యంలో పచ్చదనంపాలుతక్కువ. కాని ఆమె అందమైంది కాదని నిర్మొహమాటంగా చెప్పడానికి లేదు. ఆమెకింకా పెళ్ళి కాకపోవడానికి ముఖ్యకారణం — ఆమె అందంలో సజీవమైన ఆకర్షణ లోపించికాదు. గతంలో రెండుమూడు సంబంధాలు పెళ్ళి వరకూ వచ్చి తప్పిపోయాయి. ఒక సంబంధం వారికి ఆమె అంత ఎక్కువగా చదువుకొనివుండడం నచ్చలేదు; మరో సంబంధం వారికి కట్నంఇచ్చుకోలేని ఆమె ఆర్థిక దుస్థితి అడ్డుపడింది; ఇంకో సంబంధం వారికి ఆమె చేస్తూన్న ఉద్యోగం గిట్టలేదు. ఆ సంబంధాలు ఆ కారణాలచేత జారిపోవడంతో, 'పెళ్ళి' మీద ఆసక్తీ, అభిప్రాయమూ అడుగంటిపోయి — జీవితంపట్ల నిర్లిప్తతాభావాన్నీ సినిసిజాన్నీ పెంచుకొని, ఏకాంతమైన ఆలోచనలతో ఒంటరిగా బ్రతుకుతూన్నది.

ఆరోజు ఆదివారం; శారద గుంటూరు వెళ్ళింది. స్టేషనులో రాంమోహన్ను కల్సుకున్నది.

"మీరొక్క సహాయం చేసిపెట్టాలి" అన్నది శారద.

"ఏమిటి?" అన్నాడు రాంమోహన్.

ఆమె హ్యాండ్బ్యాగ్నుంచి ఓ దజను పోస్టుకవర్లను తీసియిచ్చింది. ప్రతి కవరులోనూ ఉత్త తెల్లకాగితాలే మడతపెట్టి ఉన్నాయి.

"ఈ కవర్లపైనా స్కూలు అడ్రసు వ్రాసి వారానికొక్కటి చొప్పున మీరు పోస్టు చేయాలి. అంతే!" అన్నదిశారద తలవంచుకొని.

రాంమోహన్ విపరీతంగా ఆశ్చర్యపడ్డాడు.

"ఎందుకు?"

"ఆ ప్రశ్న మీరు వేయకూడదు. దానికి సమాధానం చాల 'సిల్లీ' అయినట్టిది. అన్యథా భావించకండి. ప్లీజ్.

నేను చెప్పినట్టు చేయండి." అన్నది శారద కించిత్ ఆవేశపరురాలై.

"సరే!" అన్నాడు రాంమోహన్—ఆమె కేసి అయోమయంగా చూస్తూ.

వెంటనే శారద ట్రైన్లో తెనాలి వచ్చేసింది.

ఓ వారం రోజుల తర్వాత స్టాఫ్ రూమ్‌లో విజయలక్ష్మి, గోవర్ధనమ్మా, అనూరాధా, అంబుజవల్లీ, జయశ్రీ, వివేకవర్ధనీ మొదలైన టీచర్లంతా కూర్చున్నప్పుడు ప్యూను రాములు శారదకో ఉత్తరం తెచ్చి ఇచ్చాడు. పెదవులు దాటని చిరునవ్వు నవ్వుతూ ఆ లేఖను అందుకొని నిర్లక్ష్యంగా పుస్తకంలో పెట్టుకుంది. ఉపాధ్యాయినులందరూ ఆమె కేసి వింతగా చూశారు. అది

మొదలు వారం వారం శారదకు టంచనుగా ఉత్తరాలు రాసాగాయి. ఆమెను ఎగతాళి చేయడం మానివేశారు - తోటి టీచర్లు. శారద మనస్సుకు అదెంతో తృప్తి నిచ్చింది.

శారద ఆ ఉత్తరాల్ని ఎప్పటికప్పుడు భద్రంగా ఇంటికి తెచ్చి, సాయంత్రం పూట గనగనమండే పొయ్యిలో వేస్తున్నది. ఏ ఉత్తరమూ ఆమె విప్పలేదు. ఆమెకు తెలుసు: అందులో వుండేది తెల్లకాగితమేనని.

మూడు మాసాలు దొర్లిపోయాయి.

ఓ రోజు హఠాత్తుగా రాంమోహన్ ఆ గరల్స్ హైస్కూలుకు వచ్చాడు. ఆఫీసులో 'శారద'ను గురించి ఎంక్వయిరీ చేశాడు. ప్యూను రాములు అతన్ని వెంటబెట్టుకుని స్టాఫ్‌రూమ్‌కు వచ్చాడు. శారద తూర్పు దిక్కున ఓ మూల కూర్చుని క్లాసు టెస్టుపేపర్లు దీక్షగా దిద్దుతుంటూన్నది.

మన్నుతిన్న ముపాలాంటి మనిషి శారదకోసం కొబ్బరి మామిడికాయలాంటి ఓ యువకుడు రావడం స్టాఫ్ రూమ్‌లో వున్న లేడీటీచర్లందరికీ ఆశ్చర్యాన్నే గాకుండా అసూయనుకూడా కలిగించింది.

రాంమోహన్ రాకకు శారద తబ్బిబ్బు అయింది.

ఇద్దరూ బయటికొచ్చి దగ్గర్లోవున్న ఓ హోటల్లో కూర్చున్నారు.

"ఏమీలేదు. మీరుస్కూల్లో ఉన్నారో లేదో, ఎక్కడికేనా ట్రాన్స్‌ఫర్ అయినారేమో కనుక్కుందామని వచ్చాను. ఈ మధ్య మీరు కనబడటం కూడా మానివేశారు." అన్నాడు రాంమోహన్ సిగరెట్టు వెలిగిస్తూ.

"ఆ అనుమానం మీ కెందుకొచ్చింది" అన్నది శారద కనురెప్పల మీదుగా చూస్తూ.

సర్వర్ ఇద్దరి ముందూ కప్పు సాసర్లలోకాఫీ తెచ్చిపెట్టాడు. హోటల్లో జనం అట్టేలేరు.

"ఒక్క ఉత్తరానికీ మీరు సమాధానం వ్రాయలేదు." అన్నాడు రాంమోహన్ -కప్పులోకాఫీ 'సిప్' చేస్తూ.

శారద విశ్చేష్టురాలైంది. అంతలోనే తేరుకుని, "అవన్నీ ఖాళీ కవర్లేగా?" అన్నది.

రాంమోహన్ నిర్విణ్ణుడైనాడు.

"ఆ ఉత్తరాల్ని మీరు చదవలేదా?"

"ప్చ్" తల ఆడిస్తూ అమాయికంగా అన్నది శారద.

నిప్పు రవ్వలాగా పదునుగా నిట్టూర్పు విడిచాడు-రాంమోహన్.

"మరి ఆ ఉత్తరాల్ని ఏం చేశారు?"

"లోపల నేను పెట్టిన తెల్లకాగితాలే గదా-అని ఆ కవర్లను ఏరోజు కారోజు పొయ్యిలోవేస్తూండేదాన్ని విప్పకుండా."

రాంమోహన్ మొహంలో అప్పటికప్పుడే మబ్బులుపట్టి చీకట్లు జడల్ని

విరబోసుకున్నాయి. ఆ పరిస్థితికి శారద అప్రతిభురాలైంది

"ఆ ఉత్తరాల్లో ప్రకటించిన నా ప్రేమంతా వృథా అయింది. శారదా! నిన్ను ప్రేమిస్తున్నట్టూ, నీ అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా తెలుపవల్సిందిగా, త్వరలో మన వివాహానికి అంగీకరించవల్సిందిగా కోరుతూ వ్రాశాను. మా వాళ్ళు నచ్చినపిల్లను పెళ్ళి చేసుకోమని నన్ను ఒత్తిడి పెడుతున్నారు. మీనుంచి ఏ సమాధానం రాకపోయేసరికి — మీరు నాపట్ల విముఖత చూపెడుతున్నారనీ, ఒకవేళ ట్రాన్స్‌ఫర్ అయి మరో ప్రదేశానికి వెళ్ళారనీ ఏమేమో — అనుకున్నాను. ఆలోచించాను. చివరకు వుండబట్టలేక ఇట్లా వచ్చాను. ఏమంటారు?" అన్నాడు రాంమోహన్ — ఆమెకేసి ప్రేమ ఒలికిపోయేట్టు చూస్తూ.

శారద సిగ్గుతో సంపెంగమొగ్గ అయింది. ఆ సిగ్గుద్వారానే ఆమె పెదవులపై అంగీకారం బయటపడింది.

నీరెండలాంటి ఉత్సాహం అతనిలో పరవళ్ళు త్రొక్కింది. ఆమె మృదుహస్తాన్ని మృదువుగా దగ్గరకు తీసికొని — "పోనీలే! జరిగిందేదో జరిగిపోయింది. పరిస్థితులు అనుకూలించి మన వివాహం జరిగితే — ఇంకా అట్లాంటి ఉత్తరాలతో పనేముంది" అన్నాడు రాంమోహన్.

శారద మొహం వలపు వెన్నెలతో వికసించిన కుసుమమైంది.